# మినీ కథ

## మతిమరుపు



ఆ రోజు ప్రభాకర్‌కు ఆఖరి పరీక్ష. ప్యాడ్, కంపాస్, హాల్‌టిక్కెట్ తీసికొని గబగబా బస్ స్టాప్‌కు వచ్చాడు. అట్టే జనం లేరు. ఎవరో ముసలతను, ముసలావిడ నిల్చొని వున్నారు. ప్రభాకర్ వాళ్ల దగ్గరికి వెళ్లి "13వ నంబర్ బస్ వెళ్లిందాండి" అని అడిగాడు. ముసలతను ప్రభాకర్‌వైపు చూసి "లేదు" అన్నాడు పొడిగా. ప్రభాకర్ బస్ వస్తుందేమోనని రోడ్డువైపు చూపు సారించాడు. కాని అది వచ్చేట్టు లేదు అనుకొని తన వాచ్ వంక చూసాడు. ఇంకా పరీక్షకు గంట టైమ్ వుంది. ఆలోచనలలో పడిపోయాడు ప్రభాకర్. 'ఈ ఒక్క పరీక్ష రాసి తను తన సొంత ఊరు వెళతాడు. అక్కడ అంతా పచ్చని పొలాలలతో కళకళలాడుతూ ఉంటుంది. ఈ సారి ఎలాగైనా సరే ట్రాక్టర్ నేర్చుకోవాలి. పోయినసారి వెళ్లినప్పుడు తను ట్రాక్టర్ నడుపుతానంటే మామ 'ఒరేయ్ నీవు ఇంకా చిన్న పిల్లాడివి' అన్నాడు...' ఇలా ఆలోచనా తరంగాలలో పడి తేలుతుంటే ఏదో ఒక బస్ తన ముందు నుంచి మెల్లిగా కదలసాగింది. అది 13వ నంబరు బస్సే. తను ఎక్కవలసిన బస్సు అని ప్యాడ్‌ను, కంపాస్‌ను గట్టిగా పట్టుకొని బస్‌వైపు పరుగుతీసి ఎలాగోలా ఎక్కేసాడు. అప్పుడు కండక్టర్ వచ్చి "రన్నింగ్ బస్ ఎక్కకూడదని తెలియదా" అని మందలించి టిక్కెట్ తీసికోమన్నాడు. "అదికాదండి మరేమో ఇప్పుడు పరీక్ష ఉంది. ఈ బస్సు తప్పితే ఇంకొకటి లేదు" అని, పాస్ అన్నాడు చివరగా. టిక్కెట్ టిక్కెట్ అనుకుంటూ ముందుకు వెళ్లాడు కండక్టర్. ప్రభాకర్ గాఢంగా నిట్టూర్చి తన మనసులో, 'ఒక వేళ తను ఈ బస్ మిస్సయివుంటే పరీక్ష రాయలేకపోయేవాడు! ఒకవేళ ఆటోలో వెళదామంటే తన దగ్గర చిల్లిగవ్వ కూడా లేదు' అని అనుకుంటుండగానే "ఏయ్ అబ్బాయ్" అన్న పిలుపు విన బడింది. పిలుపు వినబడ్డవైపు తిరిగాడు ప్రభాకర్. "ఏదీ నీ పాస్ చెక్ చేయాలి" అన్నాడు. ప్రభాకర్ వెంటనే తన జేబులో చేయిపెట్టాడు. గుండా గినంత పనైంది. పాస్ లేదు. జేబులను తడుముకో సాగాడు. కండక్టర్‌కు అనుమానమొచ్చింది. "పాసు లేదా" అన్నాడు కర్కశంగా. 'లేదండి మర్చిపోయాను" అన్నాడు భయపడుతూ. కండక్టర్ తోక తొక్కిన తాచులా మీద పడ్డాడు. 'ఇంతకు ముందేమో రన్నింగ్ బస్ ఎక్కావు. ఏమోలే పాపం పరీక్ష వుంది కదా అనుకుంటే ఇప్పుడేమో పాస్ లేదు అంటున్నావు. మర్యాదగా టిక్కెట్ తీసుకుంటావా లేదంటే పోలీసులకు పట్టివ్వమంటావా' అన్నాడు. ప్రభాకర్‌కు ముచ్చెమటలు పోసాయి. ఏమి చేయాలో తోచలేదు. అంతలోనే బస్ సడన్ బ్రేక్‌తో ఆగింది. ప్రభాకర్ ముందుకు తూలిపడబోయి నిల దొక్కుకున్నాడు. కాని ప్యాడ్ క్లిప్‌కు కంపాస్ పెట్టి వుండడం వలన తను ముందుకు తూలినపుడు కంపాస్ క్రిందపడి తెరచుకుంది. అందులో ఒక రూపాయి బిళ్ల కనపడింది. వెంటనే వంగి అది తీసికొని కండక్టర్‌కు ఇచ్చి "ఆబిడ్స్" అన్నాడు. కండక్టర్, "ఏమిటో! ఈ కాలం పిల్లలకు మతిమరుపు రోజురోజుకు ఎక్కువవుతుంది" అని టిక్కెట్ మిగతా చిల్లరా ఇచ్చాడు. 'తను ఎప్పుడూ కంపాస్‌లో డబ్బులు పెట్టుకోడు. తన పర్స్‌లో పెట్టుకుంటాడు. దానిలోనే బస్‌పాస్ వుంటుంది. కాని అది ఈ వేళ మర్చిపోయాడు. మరి ఎవరు పెట్టారు కంపాస్‌లో డబ్బులు?' అనుకుంటూ కంపాస్ తెరచి చూసాడు. నేమ్ స్లిప్‌మీద తన చెల్లెలి పేరు వుంది. తొందరలో తనది అనుకొని తన చెల్లెలి కంపాసు తెచ్చాడు. అదే తనను రక్షించింది!!

— జి. శ్రీకాంత్

## బహుమతి



అప్పుడే చివరి పరీక్ష వ్రాసి పిల్లలంతా జట్లు జట్లుగా చెట్ల క్రింద చేరుతున్నారు. ఓ చెట్టు క్రింద ఐదారుగురు చేరారు. అందరూ సమవయస్కులే. పదో క్లాసు పరీక్ష వ్రాసిన వాళ్ళు, పద్నాలుగేళ్ళ వాళ్ళను.

చిత్రమేమిటంటే వాళ్ళంతా తెలివిగలవాళ్ళే. ఫస్టు మార్కుల కోసం పోటీపడినవాళ్ళే. ఐనా వాళ్ళ స్నేహాని కది చెరుపు చేయలేదు. మామూలుగా కలుసుకొన్నప్పుడైతే ప్రతివాడూ తాను తెలుసుకున్న కొత్త విషయాన్ని చెప్పి అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తేవాడు. ఈ స్పర్థే వారి విద్యాభివృద్ధిని మూడు పూలు ఆరు కాయలుగా చేసింది.

ఇంతకూ ఇది చివరి క్లాసు, చివరి పరీక్ష కాబట్టి వారంతా విడిపోయే అవకాశం వుంది. అందుకే వాళ్ళు మరి కాసేపు ఆ చెట్టు కింద కూర్చుని మాట్లాడుకుంటున్నారు. పరీక్షలు, రిజల్టు, వాటి ఆధారంగా వారి వారి తల్లిదండ్రులెట్లా మురిసిపోతారో చెప్పుకొంటున్నారు.

రాజు కలెక్టరు గారబ్బాయి. కారులో బడికి వస్తాడు. "నీ రిజల్టు విని మీ నాన్న నీకేమిస్తాడురా?" ఏకకంఠంగా అన్నారు రాజును చూసి. వాడు గట్టి పిండం. "మీరంతా చెప్పిన తరువాత చెప్తా" నన్నాడు. అందరూ చేరి ఓ పేద పిల్లవాడు రఘుని పట్టుకున్నారు. "మీ నాన్న నీకేమిస్తాడురా?" అని. వాడు బిక్కమొహం వేశాడు. "చెప్పరా" గదమాయించాడు వెంకటేశ్, వర్తక ప్రముఖుని ముద్దుబిడ్డ.

"నాకేమో పై చదువులు చదవాలని వుంది. మా నాన్నేమో ఇప్పుడే ఏదైనా పనిలో చేరమంటున్నాడు. గవర్నమెంటే అన్నీ సమకూరుస్తున్నా, మా నాన్న నన్ను చదవనిస్తే అదే పెద్ద బహుమతి" అన్నాడు రఘు. అందరూ బాధపడ్డారు. రఘుకి ధైర్యం చెప్పి "మేము లేమా?" అని ఓదార్చారు.

"నువ్వు చెప్పరా భద్రం!" అడిగారంతా. భద్రం భూస్వామి కొడుకు. "మా నాన్న కలర్ టివి కొంటాడు" మురిసిపోయాడు భద్రం. "మరి మీ నాన్నో?" అడిగాడు భద్రం వెంకటేశ్‌ని. అందరూ పట్టు పట్టారు. "అడిగింతే తడవుగా ఇచ్చేస్తారు కాని ఆలోచించలేదింకా!" అన్నాడు వెంకటేశ్. "ఆలోచించేందుకు బుర్ర వుండవద్దా?" ఎగతాళి చేశాడు రాజు. వెంకటేశ్ మొహం చిట్లించుకుని బుర్ర గోక్కొని "ఆ! వి సీ ఆర్!" అన్నాడు తనూ ఆలోచించగలనన్న పోజు పెట్టి.

అందరూ రాజు వంక చూశారు. ఇంకా చెప్పవలసిన వాడున్నాడంటూ ఆనందవర్థన్ వంక చూశాడు రాజు. "రాజా! నీవు చివరకే చెప్పు. ఐనా నీ రిజల్టు విని మీ నాన్న నీకివ్వదగిన కొత్త బహుమతేముంది గనుక! ఇక నా మాటంటావా, మా నాన్న ఎప్పుడూ ఒకే బహుమతి ఇస్తారు. ఐనా అది ఎప్పటికీ కొత్తదే! అంతే కాదు. అది అమూల్యం!" అన్నా డానంద్. అందరూ ఆశ్చర్య పోయారు. అందరి కంటె గొప్ప బహుమతిని చెప్పాలన్న రాజు ఉత్కంఠకు అంతు లేదు. అందరూ తొందర పెట్టారు. ఆనంద్ నెమ్మదిగా చెప్పాడు "మా నాన్న నా రిజల్టు విని దగ్గరకు తీసుకుని ముద్దు పెట్టుకుంటారు."

అది విని అంతా తెల్లబోయారు. ఎవ్వరూ మాట్లాడ లేదు. చివరికి కారులో బడికి వచ్చే కలెక్టరు కొడుకు రాజు కూడా! ఇంతకూ ఆనందవర్థన్ తండ్రి ఓ చిన్న బడి పంతులు.

—చిట్టా దామోదర శాస్త్రి